# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి

**నిజాంసాగర్ ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి**

నిజాంసాగర్, డిసెంబర్16: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ పట్లోళ్ల జ్యోతి అన్నారు. నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ముందుగా వైద్యుడు రోహిత్‌కుమార్‌తో మాట్లాడి దవాఖానకు వచ్చే రోగులు, మందుల సరఫరా, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. దవాఖానకు వచ్చే రోగులకు సరైన వైద్య సేవలను అందించాలని సూచించారు. దవాఖానలో కల్పించాల్సిన వసతుల గురించి సమావేశంలో చర్చించారు. సమావేశంలో సీనియర్ నాయకుడు దుర్గారెడ్డి, వైస్ ఎంపీపీ మనోహర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలి



పిట్లంలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర్

పిట్లం/ రామారెడ్డి/ తాడ్వాయి, డిసెంబర్ 16: పిట్లం మండలంలోని నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వర్ అన్నారు. ఆయన శనివారం మండలకేంద్రంలోని నర్సరీని సందర్శించారు. మొక్కల పెంపకం కోసం ఉపాధి హామీ సిబ్బంది బ్యాగ్ ఫిల్లింగ్ చేయడాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నర్సరీలో పెంచే ప్రతి మొక్కనూ సంరక్షించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయనవెంట ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి ఉన్నారు.

రామారెడ్డి మండలంలోని స్కూల్ తండా నర్సరీలో చేపడుతున్న పనులను ఏపీవో ధర్మారెడ్డి శనివారం పరిశీలించారు. కూలీలు చేపడుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. నిత్యం రెండు పూటలా నీరు పట్టాలని, మొలకెత్తిన వాటిని రక్షించాలని ఫీల్డ్ అసిస్టెంట్ బలరాంనాయక్‌కు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాజేశ్ ఉన్నారు.

తాడ్వాయి మండలంలోని దేవాయిపల్లి గ్రామ ఉపాధి హామీ నర్సరీలో మొక్కల పెంపకం పనులను ఎంపీడీవో రాజ్‌వీర్ శనివారం పరిశీలించారు. హరితహారంలో భాగంగా గ్రామంలోని ఖాళీ స్థలాల్లో రోడ్డు వెంట నాటడానికి అవసరమైన మొక్కలను నర్సరీలో పెంచడానికి ఏర్పాట్లు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్‌తో కలిసి అవసరమైన మొక్కల కోసం ప్రణాళికలను తయారు చేయాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నాటేందుకు నర్సరీల్లో మొక్కల పెంచే కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ తండాలో నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో ధర్మారెడ్డి

## బడి బయటి బాలుడి గుర్తింపు



బడి మానేసిన బాలుడితో సీఆర్పీ మహిపాల్

ఎల్లారెడ్డి, డిసెంబర్ 16: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్న బాలుడిని గుర్తించినట్లు సీఆర్పీ మహిపాల్ తెలిపారు. బడీడు పిల్లలను గుర్తించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో శనివారం పర్యటించామని అన్నారు. ఎనిమిదేండ్ల బాలుడు పాఠశాలకు వెళ్లడం లేదని గుర్తించామని, అతడిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామని తెలిపారు.

## రైతు బంధు కోసం
## దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి, డిసెంబర్ 16: గడిచిన ఆరు నెలల్లో భూములను కొనుగోలు చేసిన అన్నదాతలు రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తీర్ణ అధికారి రాజాగౌడ్ తెలిపారు. రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

బిచ్కుంద, డిసెంబర్ 16: చుట్టాల ఇంటికి వచ్చిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. బిచ్కుంద పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్రుల్లాబాద్ మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన నీరుడి కామయ్య బిచ్కుంద మండలంలోని ఫత్లాపూర్ గ్రామానికి ఇటీవల వచ్చాడు. ఫత్లాపూర్‌లో రెండు రోజులు ఉండి తిరిగి మంగళవారం బయల్దేరాడు. ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల ఇండ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో అతడి భార్య గంగామణి బిచ్కుంద పోలీసులకు ఫిర్యాదు చేసింది. మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చర్యలు




సౌత్ క్యాంపస్‌లో యాంటీ ర్యాగింగ్ సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్

భిక్కనూరు, డిసెంబర్ 16 : జూనియర్ విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్ హెచ్చరించారు. నూతన విద్యార్థులు క్యాంపస్‌లో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు, జూనియర్స్‌తో స్నేహంగా ఉండాలని అన్నారు. పరిచయం పేరుతో ఇబ్బందులకు గురి చేయవద్దని, ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు హెచ్చరించారు. జూనియర్ విద్యార్థులు కూడా సీనియర్ విద్యార్థుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తూ కలిసిమెలిసి ఉండాలన్నారు. క్యాంపస్‌లో మంచి సౌకర్యాలు ఉన్నాయని, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, విద్యార్థులందరూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, సీనియర్, జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

భిక్కనూరు, డిసెంబర్ 16 : అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి భిక్కనూరు మండలంలోని ఓ గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి సంబంధిత అధికారులకు, మైనింగ్ డిపార్ట్‌మెంట్‌కు పంపించామన్నారు. మండలంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



బోర్లం క్యాంపు తండా గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సర్పంచ్ నాన్కుబాయి

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 16 : గ్రామంలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలను వార్డు సభ్యుల ద్వారా తెలుసుకొని పరిష్కరించాలని బోర్లం క్యాంపు తండా సర్పంచ్ నాన్కుబాయి పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణకు సూచించారు. పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పాలవకర్గ సమావేశంలో వార్డుల వారీగా ఉన్న సమస్యలను వార్డు సభ్యులను ఆమె అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయించాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. పెండింగ్ బకాయిలను గ్రామస్తులు సకాలం లో చెల్లించి గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆమె కోరారు. ప్రమాదవశాత్తు ఇటీవల మరణించిన వార్డు సభ్యురాలు బశవ్వకు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఉప సర్పంచు కొండ సాయిలు, వార్డు సభ్యులు సుభాష్, మీరిబాయి, కో–ఆప్షన్ సభ్యురాలు సావిత్రి, కారోబార్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 16 : కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో వైద్యులు రాజ్యలక్ష్మీ, ప్రవీన్ దంపతులు బాలుర ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. డాక్టర్ రాజ్యలక్ష్మీ 6 నుండి 10వ తరగతి చదువుతున్న బాలికలతో కౌమారదశలో వచ్చే మార్పులు తదితర సమస్యల గురించి అవగాహన కల్పించారు. రక్త పరీక్షలు నిర్వహించి ఎంత హిమోగ్లోబిన్ ఉన్నదో తెలియజేశారు. రక్తహీనత ఉన్న బాలికలు తప్పకుండా ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, ప్రవీన్‌కుమార్, ఉమాదేవి, ప్రభాకర్, రాజ్యలక్ష్మీ, సుశీల, రామకృష్ణ, బాబు, గోపాల్, సుదర్శన్, సత్యనారాయణ, గణేశ్ పాల్గొన్నారు.